## పాలకులారా ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడండి

# ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయండి

ప్రజలారా! - CPM

అన్నీ ఉండి అన్యాయమైపోయింది ఉత్తరాంధ్ర. నీరుండీ కరువే. వనరులున్నా వలసలే. అక్షరాస్యతలో అట్టడుగు స్థానం. తలసరి ఆదాయంలో చిట్టచివరి స్థానం. శిశుమరణాల్లో, తల్లుల మరణాల్లో అగ్రస్థానం. ప్రతిపేట మలేరియా మహమ్మారిన పడి చనిపోతున్న గిరిజనులు లెక్కకు మిక్కుటం.

తిండికి గతిలేక, కనీస అవసరాలు తీరక లక్షలాది ఉత్తరాంధ్ర ప్రజలు సుదూర ప్రాంతాల్లో వలసల్లో బ్రతుకుతున్నారు. మట్టిపనులు, ఇటుక బట్టీ పనులు, స్పిన్నింగ్ మిల్లుల్లో బందీలై, నిర్మాణ పనుల్లో కూలీలుగా ఎటువంటి రక్షణ లేని జీవితాలతో చస్తున్నారు. చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్ ఎక్కడ బిల్డింగ్ కూలినా మరణించేది వారే. దూర ప్రయాణాలు లారీలలో సాగించి అవి తిరగబడి చనిపోతున్న ఉత్తరాంధ్ర వలస కూలీలు వారే.

తల్లీ, తండ్రీ వలసల్లో జీవిస్తుంటే పిల్లలు, ముసలివాళ్ళ వద్ద ఎటువంటి ఆలనాపాలనా లేక దారుణమైన పరిస్థితుల్లో బ్రతుకుతున్నారు. సరియైన తిండిలేక, కునారిల్లిపోతున్నారు. చదువులో వెనుకబడిపోయి సమాజంలో అట్టడుగున పడిపోతున్నారు. ఉత్తరాంధ్ర ఈ దుస్థితికి కారణం ఏమిటి? ఎవరు దీనికి బాధ్యులు?ఇప్పటికైనా ఉత్తరాంధ్ర అభివృద్ధికి మార్గాలేమిటి? ఆలోచించాలి.

| జిల్లా | అక్షరాస్యత | శిశుమరణాలు | కాలువల ద్వారా సాగునీరు | హెక్టారుకు వరి ఉత్పత్తి | తలసరి ఆదాయం |
|---|---|---|---|---|---|
| శ్రీకాకుళం | 61 | 49 | 20% | 1748 | 53203 |
| విజయనగరం | 58 | 47 | 10% | 2490 | 60545 |
| రాష్ట్రం | 67 | 41 | 48% | 3094 | 90517 |

### ఉత్తరాంధ్ర వెనుకబాటుకు టిడిపి, కాంగ్రెస్ పార్టీలే కారణం

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుండి అటు దేశాన్ని ఇటు రాష్ట్రాన్ని ఎక్కువ కాలం పాలన చేసింది కాంగ్రెస్. 16 ఏళ్లు రాష్ట్రాన్ని పాలించింది టిడిపి. వేరెవరూ ఒక్కరోజూ పాలన చేయలేదు. ఈ పాపం అంతటికీ ఈ రెండు పార్టీలే కారణం. ఈ పాలనెంత వివక్షతో ఉందో దిగువ కొన్ని అంశాలు చూడండి.

450 కోట్ల అంచనాతో తోటపల్లి బ్యారేజి, 900 కోట్ల అంచనాతో వంశధార ఫేజ్-2 సాగునీటి ప్రాజెక్టులకు 2002లో శ్రీ చంద్రబాబు శంకుస్థాపన చేస్తూ మూడేళ్లలో పూర్తి చేస్తామన్నారు. రెండు ప్రోజెక్టుల ఖర్చు 1350కోట్లు. 4.50 లక్షల ఎకరాలకు సాగునీరిస్తుంది. 13వ ఏడు నడుస్తున్నది. రెండు ప్రాజెక్టులూ పూర్తి కాలేదు. రెండు ప్రాజెక్టులపై 12 సంవత్సరాలలో 12 బడ్జెట్‌లలో ప్రభుత్వం కేటాయించింది 1000కోట్లే.

చంద్రబాబు రాజధానికి నీరు అవసరమని భావించి పోలవరంతో నిమిత్తం లేకుండా పట్టిసీమ కాలువ ద్వారా లిఫ్ట్ చేసి నీరు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. అందుకు కావాల్సిన 1300 కోట్లూ 2015-16 ఒకే ఒక బడ్జెట్‌లో కేటాయించేసారు.

ఎంత అన్యాయం? ఎంత వివక్ష? ఎంత పెత్తందారీతనం? ఉత్తరాంధ్రలో అతి ముఖ్యమైన రెండు ప్రోజెక్టులు పూర్తి కావడానికి అయ్యే ఖర్చు 1350కోట్లు కేటాయించడానికి 13 బడ్జెట్లు చాలలేదు. మరోవైపు పెట్టుబడిదార్లకు అవసరమైతే ఒకే ఒక బడ్జెట్‌లో 1300 కోట్లూ కేటాయించేసారు. ఇదే మొదటినుండీ జరుగుతున్నది. అందువలనే ఉత్తరాంధ్ర వెనుకబడిపోయి ప్రజలు దిక్కులేని వాళ్ళుగా, డబ్బున్న వాళ్ళకు పనిమనుషులుగా బ్రతకాల్సిన దుస్థితి ఏర్పడింది.

### ఉత్తరాంధ్రను డంపింగ్ యార్డుగా మారుస్తున్నారు

విశాఖనగరంలో ప్రభుత్వ పరిశ్రమలు మినహాయించి ఉత్తరాంధ్రలో ప్రభుత్వం ఎటువంటి పెట్టుబడి పెట్టలేదు. విద్యలో, నైపుణ్యంలో వెనకబాటు వలన విశాఖలో వచ్చిన ప్రభుత్వ రంగ పరిశ్రమల్లో గాని, ప్రయివేటు పరిశ్రమల్లో గాని ఉత్తరాంధ్ర ప్రజలు తగినంత ఉపాది పొందలేకపాయారు ఇప్పటికైనా విద్యాభివృద్ధికి, నైపుణ్యాభివృద్దికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వకుంటే విశాఖను అభివృద్ధిచేసిన ఉత్తరాంధ్ర ప్రజలకు ఒరిగేదేముండదు. ప్రభుత్వ ప్రయివేటీకరణ మూలంగా ప్రభుత్వ పరిశ్రమలన్నీ ప్రయివేటుగా మారిపోతున్నాయి. మిగతా ఉత్తరాంధ్రంలో ఉన్న ఆగ్రోబేస్డ్ పరిశ్రమలైన జూట్, షుగర్ ఫ్యాక్టరీలు ప్రభుత్వాల సరళీకరణ విధానాల కారణంగా మూతపడిపోతున్నాయి. ఉత్తరాంధ్రంతా ధర్మల్ పవర్‌ప్లాంట్‌లు, మందులు, రసాయన కంపెనీలు, అణు విద్యుత్ కేంద్రం. వీటికి భూములు పోవడమే తప్ప ఉద్యోగాలు, ఉపాధికల్పన ఉండదు. కానీ కాలుష్యం కోరల్లో ఉత్తరాంధ్ర ప్రజల ఆరోగ్యం కూనరిల్లుతుంది. అణువిద్యుత్, బాక్సైట్ మూలంగా ప్రజలకు తీవ్రమైన ప్రాణ హాని కూడా ఉంది. ఒక రకంగా ఉత్తరాంధ్రను డంపింగ్‌యార్డు క్రింద మార్చివేస్తున్నారు.

### ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధి కావాలి

ఇంతకాలం చూపిన నిర్లక్ష్యం ఇంకా కొనసాగిస్తున్న చంద్రబాబు రాజధాని నిర్మాణమే సర్వస్వంగా మార్చేసారు. అందమైన, అద్భుతమైన రాజధాని నిర్మిస్తామంటున్నారు. రాజధాని అందంగా, అద్భుతంగా నిర్మించినా ఉత్తరాంధ్ర ప్రజలకు ఒరిగేదేమిటి? గతంలో హైదరాబాద్‌ను నిర్మించామని గొప్పలు చెప్పి చంద్రబాబు దాని వలన ఉత్తరాంధ్ర ప్రజలకు ఏమి ఒరిగిందో చెప్పాలి. మొత్తం వనరులన్నీ ఒకేచోట కుమ్మరించి వెనుకబడిన ప్రాంతాలకు అన్యాయం చేయడం సమగ్రాభివృద్ధా?ఇంకా ఈ నిర్లక్ష్యాన్ని సహిద్దామా? సమైక్యంగా ఉద్యమిద్దాం న్యాయంగా రావాల్సిన వాటాకోసం జరగాల్సిన అభివృద్ధికై పోరాడదాం.

**డిమాండ్స్:**

1. ఉత్తరాంధ్ర నిర్మాణంలో వున్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తికి 3000 కోట్లు ఇవ్వాలి.
2. గోదావరిలో వాటాగా రావాల్సిన 80టిఎంసి లను పోలవరంతో నిమిత్తం లేకుండా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా లిప్టు చేసి ఇవ్వాలి.
3. పాడేరు, పార్వతీపురంలో మెడికల్‌కాలేజీలు, అరుకు, కురుపాంలో ఇంజినీరింగ్ కాలేజీలు, సాలూరులో గిరిజన యూనివర్శిటీ ప్రభుత్వమే ఏర్పాటుచేయాలి.
4. సాలూరు, కురుపాం, అరుకు, రంపచోడవరం, కూనవరంలో ప్రభుత్వం ఏరియా ఆసుపత్రులను, పాలకొండలో జిల్లా కేంద్ర ఆసుపత్రి నెలకొల్పాలి.
5. విజయనగరంలో గురజాడ పేరున సాంస్కృతిక విశ్వ విద్యాలయం నెలకొల్పాలి.
6. తీరం అంతటా మత్స్యకారుల వేటకు జెట్టీలు, కోల్డ్ స్టోరేజీలు నెలకొల్పాలి.
7. వృత్తిదార్లు, గిరిజనుల పిల్లల చదువుకై ఆశ్రమ పాఠశాలలు నెలకొల్పాలి.
8. విశాఖ స్టీలుప్లాంటు ప్రైవేటీకరణ విరమించి, గనులను కేటాయించాలి, ప్లాంట్లు విస్తరించాలి.
9. ఉత్తరాంధ్రకు ప్రత్యేక పేకేజీ ఇవ్వాలి.
10. గిరిజన ప్రాంతంలో అటవీ ఉత్పత్తులతో ప్రోసెసింగ్ పరిశ్రమలు పెట్టాలి.

**సిపియం - ఆంధ్రప్రదేశ్ కమిటీ**